## పాలిసెట్‌కు సర్వం సిద్ధం
### ఒక నిమిషం నిబంధన అమలు

జనగామ చౌరస్తా, మే 9 : ఇంజినీరింగ్ డిప్లొమా, నాన్ ఇంజినీరింగ్, టెక్నాలజీ, వ్యవసాయ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 13న నిర్వహించే పాలిసెట్-2025కు సర్వం సిద్ధం చేసినట్లు శుక్రవారం జనగామ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఏ నర్సయ్య తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. నిమిషం ఆలస్యంగా వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో లోపలికి అనుమతించరని తెలిపారు. జిల్లావ్యాప్తంగా మూడు పరీక్ష కేంద్రాల్లో 1416 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ హాల్ టికెట్‌తో పాటు హెచ్‌బీ బ్లాక్ పెన్సిల్, బ్లూ లేదా బ్లాక్ పెన్‌తో మాత్రమే రావాలని సూచించారు.

## దవాఖానలోనే ప్రసవాలు జరగాలి

బచ్చన్నపేట, మే 9 : ప్రతి పీహెచ్‌సీలో ప్రసవాలు జరుగాలని జిల్లా ప్రోగ్రాం అధికారి రవీందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ ఆంజనేయులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీ నుంచి కనీసం 15 సాధారణ ప్రసవాలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. హైరిస్క్ కేసులను ఏఎన్‌సీ ఉన్నత సంస్థలను రెఫర్ చేయాలన్నారు. మహిళా అధికార విభాగం, సిబ్బంది, పిల్లల డిపార్ట్‌మెంట్ గురించి వారి ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కల్గించేలా సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్ అడ్వైజర్ మెంబర్‌గా అట్ల రాజు



స్టేషన్ ఘన్‌పూర్, మే 9 : కాకతీయ యూనివర్సిటీ పరిధి జాతీయ సేవా పథకం 220 యూనిట్లకు డిగ్రీ అండ్ జూనియర్ కళాశాలల అడ్వైజర్ మెంబర్‌గా యూనివర్సిటీ లా కాలేజీ విద్యార్థి అట్ల రాజు ఎంపికైనట్లు ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నమిలిగొండకు చెందిన అట్ల రాజు గతంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటరీగా పని చేస్తూ కళాశాల, జిల్లా, యూనివర్సిటీ, రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు అందుకున్నట్లు పేర్కొన్నారు. అతడి అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని అడ్వైజర్‌గా నియమించినట్లు తెలిపారు.

## టోల్‌గేట్‌ను ఢీ కొట్టిన లారీ డ్రైవర్‌కు జైలు

రఘునాథపల్లి, మే 9 : మద్యం మత్తులో లారీని అశ్రద్ధగా నడిపి, టోల్ గేట్‌ను ఢీ కొట్టిన ఓ డ్రైవర్‌కు జైలుశిక్షతో పాటు జరిమానా విధించిన్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ తెలిపారు. గత నెల 19న మద్యం మత్తులో మక్క శంకర్ అనే లారీ డ్రైవర్ తన లారీని నడిపి టోల్‌గేట్‌ను ఢీకొట్టాడు. దీంతో టోల్‌బూత్ పూర్తిగా ధ్వసంమైంది. ఈ మేరకు పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి శుక్రవారం జనగామ సెంకడ్ క్లాస్ మెజిస్టేట్ వెంకట్రాం నర్సయ్య ఎదుట ప్రవేశపెట్టారు. జడ్జి అతడికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**గోదాం కావలెను**
★పెద్దవంగరలోని మన గ్రోమోర్ సెంటర్‌కు పర్మినెంట్ గోదాం కావలెను. 1500-2000 Sq.fts గలది పెద్దవంగర మేన్ రోడ్ పరిధిలో కావలెను. సంప్ర: 9121044072, 91001007590.
NTW-337013

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# నిధులు 'నీళ్ల'పాలు

- అవసరం లేని చోట చెక్‌డ్యాం నిర్మాణం
- గతంలో నిలిపివేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- ప్రస్తుతం మళ్లీ అనుమతులు
- కమీషన్లకు అధికారుల కక్కుర్తి
- రూ.2.6కోట్ల ప్రజాధనం దుర్వినియోగం
- పొలాలు మునిగేలా ఉన్నాయని స్థానిక రైతుల ఆవేదన



వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యాం



నాసిరకంగా చేపడుతున్న మట్టి నిర్మాణ పనులు




సమీపంలోనే ఉన్న రిజర్వాయర్, కుంట

కొడకండ్ల, మే 9 : ప్రభుత్వం అప్పుల్లో ఉందని తెల్లవారితే వార్తల్లో సీఎం రేవంత్‌రెడ్డి చెప్తుంటే, ఇక్కడ మాత్రం అధికారులు అనవసర ప్రాజెక్టుకు నిధులు కేటాయించి, నాసిరకం, నాణ్యత లేని పనులు చేపడుతున్నారు. కాంట్రాక్టర్లు లాభాలు, అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి రూ.2.6 కోట్ల నిధులతో కొడకండ్ల మండలం, నర్సింగాపురం బయ్యన్న వాగుపై చెక్ డ్యాం నిర్మాణం చేపట్టారు. దీనికి 500 మీటర్లలోపే 0.25 టీఎంసీల రిజర్వాయర్, 200 మీటర్లలోపే ఒక కుంట ఉంది. రైతులు కూడా ఇక్కడ చెక్‌డ్యాం వద్దని ఎన్నిసార్లు చెప్పినా వినకుండా పనులు చేస్తున్నారు. అవగాహన లేమితో అప్పటి ప్రజాప్రతినిధులు చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రపోజల్ పంపడంతో బీఆర్‌ఎస్ అనుమతి ఇచ్చింది. అయితే, స్థానిక ప్రజలు, రైతులు వద్దనడంతో చెక్ డ్యాం నిర్మాణాన్ని నిలిపి వేసింది. ఈ క్రమంలో రెండు సార్లు నిర్మాణం చేపడుతామని అధికారులు వస్తే రైతులు అడ్డుకున్నారు. అప్పట్లో కలెక్టర్‌కు సైతం వినతి పత్రం ఇచ్చి పనులు నిలుపుదల చేశారు. దీంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా చెక్ డ్యాం నిర్మాణ అనుమతులు రద్దు చేసింది. అయితే, ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి ప్రాజెక్టు ప్రాంతాన్ని కొద్ది దూరానికి మార్చి మరోసారి అనుమతులు తీసుకొచ్చారు. 200 ఎకరాల ఆయకట్టు దీని పరిధి. కానీ, కనీసం 20 ఎకరాలకు కూడా దీని అవసరం లేదు. అంతకు ముందే ఇక్కడ నీరు పుష్కలంగా ఉంది. ఆ ప్రాంతంలో చెక్‌డ్యాం అవసరం లేదని తెలిసినా తక్కువ కెపాసిటీ గల చిన్నదాన్ని కూల్చివేసి ఆ ప్రాంతంలో రైతులు వద్దని వారించినా వినకుండా పెద్ద చెక్‌డ్యాం నిర్మాణం చేపడుతున్నారు. ఇది ఎవరి లాభాల కోసం? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్‌ని వివరణ కోరగా అప్పటి మాజీ సర్పంచ్ గ్రామ సభ ద్వారా అనుమతి కోరితేనే మంజూరు చేసినట్లు తెలిపారు.

**పుష్కలంగా నీరు ఉన్నా..**

కొడకండ్ల మండలం నర్సింగాపురం గ్రామంలోని బయ్యన్నవాగులోని చెక్ డ్యాం నిర్మాణ స్థలానికి 500 మీటర్ల దూరంలోనే 0.25 టీఎంసీ నిల్వ గల రిజర్వాయర్ ఉంది. దగ్గర్లోనే ఒక కుంట కూడా ఉంది. భూగర్భ జలాల శాతం కూడా ఈ ప్రాంతంలో ఎక్కువనే ఉంది. అప్పటి ప్రజాప్రతినిధులు అవగాహన లేమితో ప్రతిపాదన పంపగా రైతులు వద్దనడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ప్రస్తుతం కూత వేటు దూరంలో రిజర్వాయర్ ఉన్నా రూ.2.6 కోట్ల నిధులతో చెక్ డ్యాం పనులు చేపడుతున్నారు. వాగులో నిరంతరం రిజర్వాయర్ ఊట నీరు ప్రవహిస్తూ రైతులకు వానకాలం, యాసంగి పంటలకు అందుతుంది. రిజర్వాయర్ నుంచి వచ్చే ఊట నీరును మొత్తం ఈ వాగులో వదులుతారు. ఇక్కడ చెక్‌డ్యాం నిర్మాణంతో ఏ రైతుకూ ప్రయోజనం లేదు. చెక్ డ్యాం నిర్మాణంతో సుమారు 200 మీటర్లు మాత్రమే నీరు నిలిచి ఉంటుంది. కానీ, అక్కడి రైతులు అంతకు ముందే ఊట బావిలో నీరు పుష్కలంగా వస్తుందని, దగ్గరలోనే ఎన్నో రెట్ల నీరు నిలువ గల రిజర్వాయర్ ఉందని చెబుతున్నారు.

**నాసిరకం పనులు, నాణ్యత లేని నిర్మాణం**

చెక్ డ్యాం పనులకు మొదటి నుంచీ లోకల్ ఇసుక, వాగులో ఉన్న ఇసుకను వాడుతున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించారని రైతులు వాపోతున్నారు. కొంత డస్ట్ వాడుతూ, కొంత లోకల్ ఇసుకను వాడుతున్నారు. లోకల్ ఇసుక అందుబాటులో లేకపోతే మట్టిని ఫిల్టర్ చేసి నిర్మాణానికి వినియోగించినట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. సిమెంట్ బస్తాలు కూడా నాసిరకంగా ఉన్నాయని ఆరోపిస్తున్నారు. చెక్ డ్యామ్‌కు ఇరువైపులా మట్టితో నిర్మాణం చేయాల్సి ఉండగా అది కూడా అరకొరగా చేస్తూ పని తప్పించుకుంటున్నారు. దీంతో తమ పంట పొలాలు మునిగే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. సైడ్‌లకు మట్టి నిర్మాణంతో పాటు, రాతి నిర్మాణం కూడా లేదని చెబుతున్నారు.

### ఎవరి లాభం కోసం చెక్‌డ్యాం?



కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2.6 కోట్ల నిధులతో అనవసరమైన ప్రాజెక్టును నిర్మిస్తుంది. అది కూడా పూర్తిగా నాణ్యత లేకుండా, లోకల్ ఇసుకను వాడుతున్నారు. అధికారులు కూడా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నిర్మాణంలో ఎక్కువ శాతం డస్టునే వాడారు. సిమెంటు బస్తాలు కూడా నాసిరకంగా ఉన్నాయి. తూతూ మంత్రంగా చెక్‌డ్యాం పూర్తి చేశారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇక్కడ కట్టే బదులు అవసరమైన చోట కడితే బాగుండు. రైతు భరోసా, రుణ మఫీ, బోనస్‌లాంటి పూర్తిగా ఇవ్వలేదు. కానీ ఎవరి లాభం కోసమో ఇలాంటి నిర్మాణాలకు రూ.కోట్లు పెట్టి ప్రజధనం దుర్వినియోగం చేస్తున్నారు.

– పేరం రాము, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కొడకండ్ల

### మా పొలాలు మునిగేటట్టు చేస్తుండ్రు



మాకు కూతవేటు దూరంలో రిజర్వాయర్ ఉంది. నీరు ఇంతకు ముందే పుష్కలంగా ఉంది. అప్పటి ప్రజాప్రతినిధులు అవగాహన లేక చెక్‌డ్యాంకు అనుమతులు తెచ్చిండ్రు. కానీ, మాకు వద్దు, దీని వల్ల లాభం కంటే నష్టం ఉందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినం. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెక్ డ్యాం నిర్మాణం ఆపింది. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎలాంటి సమాచారం లేకుండా నిర్మాణానికి అనుమతి వచ్చింది. ఆగమాగం చేసుకుంటా నిర్మాణం పూర్తి చేశారు. వద్దు అని చెప్పే సమయం ఇవ్వకుండా టకటకా కట్టారు. ఇప్పుడు మా పొలాలు మునిగేటట్టు ఉన్నాయి. సైడుకు కట్టలు పోయాలని చెప్పినా వినకుండా వారి పని వారు చేసుకుంటూ వెళ్లిపోతున్నారు. మాకు న్యాయం చేయాలి. ఈ చెక్ డ్యాం వల్ల రైతులకు నష్టమే తప్ప లాభం లేదు.

– దండెంపల్లి సోమయ్య, రైతు, నర్సింగాపురం

## సాక్షి ఎడిటర్ ఇంటిపై దాడికి నిరసన

జనగామ చౌరస్తా, మే 9 : సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై ఏపీ పోలీసులు చేసిన దాడిని శుక్రవారం జనగామ జిల్లా జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పలు జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలు ధరించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులను టార్గెట్‌గా చేసుకొని దాడులు చేయడం సరికాదన్నారు. ఏపీ ప్రభుత్వంతో పాటు అక్కడి పోలీసులు ఇదే విధానాన్ని అవలంభిస్తే దేశవ్యాప్త ఆందోళనలకు జర్నలిస్టులు సిద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఇర్రి మల్లారెడ్డి, ఎండబట్ల భాస్కర్, హింగె మాధవరావు, బండి శ్రీనివాస్, ఉల్లెంగుల మణి, కన్నారపు శివశంకర్, శశిధర్, సొరిగెల భిక్షపతి, కేమిడి ఉపేందర్, సీహెచ్ ఉపేందర్, భాను, మాచర్ల ఆశీశ్, మరేడి వినయ్, ఎజాజ్, మణి కుమార్, సాగర్, ఓంకార్, గోవర్ధనం వేణు, మోహన్, ఉపేందర్, యూసుఫ్ పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యురాలు యాకాంత

## ఇందిరమ్మ కమిటీ సభ్యురాలి సంతకం ఫోర్జరీ
### తనకు తెలియకుండానే లిస్ట్ ఫైనల్ చేశారని ఫిర్యాదు

జఫర్‌గఢ్, మే 9 : మండలంలోని సాగరం గ్రామంలో తన సంతకం ఫోర్జరీ చేసి, లిస్ట్ ఫైనల్ చేశారని ఆరోపిస్తూ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యురాలు యాకాంత శుక్రవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగరం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన తాను ఇందిరమ్మ కమిటీలో సభ్యురాలిగా ఉన్నానని, ఇటీవల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఫైనల్ లిస్ట్‌ను తనకు తెలియకుడానే విడుదల చేశారన్నారు. అంతేకాకుండా దానిపై తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి కనకరాజుతోపాటు, ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

## లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

దేవరుప్పుల, మే 9 : ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని మండలంలోని గొల్లపల్లి గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో అనర్హులను ఎంపిక చేస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని కోరారు. ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు జక్కి సురేశ్, జే వెంకన్న, ఎల్లేశ్, సోమలింగం, మధు, కన్న రామచంద్రం, సందీప్, మల్లేశ్, ప్రసాద్, అంజయ్య, బయ్యాలు, లక్ష్మి, మురళి, యాదమ్మ, తిరుమలమ్మ, భవానీ, అనూష, ఆశ్విని, నవ్య, నిర్మల పాల్గొన్నారు.

## వరి కొయ్యలకు నిప్పు.. 40 గడ్డి కట్టలు దగ్ధం

స్టేషన్‌ఘన్‌పూర్, మే 9 : వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో గాలికి వ్యాపించి, పలువురి రైతులకు చెందిన గడ్డి కట్టలు దగ్ధమైన ఘటన మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో చోటు చేసుకుంది. శుక్రవారం గ్రామంలో ఓ రైతు వరి కొయ్యలకు నిప్పు పెట్టగా గాలికి మంటలు చెలరేగి, పెద్ద ఎత్తున వ్యాపించాయి. ఇది చూసిన యాకయ్య అనే వ్యక్తి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించాడు. సమయానికి ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు, కానీ ఫైర్ వాహనం సంఘటన స్థలానికి పోవడానికి వీలు లేకపోడంతో రైతులతో కలిసి వారు చెట్ల కొమ్మలతో కొడుతూ, బోరు నీరు పోసి మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద నష్టం తప్పింది. ఈ ఘటనలో ఓర్సు వెంకటయ్యకు చెందిన పైపులు, వైరు, 25 గడ్డి కట్టలు దగ్ధం కాగా, రూ.13 వేల వరకు నష్టం వాటిల్లింది. అలాగే, సిద్ధిలింగానికి చెందిన 15 గడ్డి కట్టలు దగ్ధం కాగా, సుమారు రూ.6వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.



పాలకుర్తి : సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అధికారులు, అర్చకులు



బచ్చన్నపేట : కొడవటూరు సిద్ధేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి

## భారత సైన్యానికి మద్దతుగా ప్రత్యేక పూజలు

పాలకుర్తి, మే 9 : ఆపరేషన్ సింధూరులో భాగంగా పాకిస్తాన్‌తో వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో అర్చకులు, ఆలయ అధికారులు పంచామృతాలతో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి ఈవో సల్వాది మోహన్ బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు దేవగిరి లక్ష్మన్న శర్మ, రమేశ్ శర్మ, అనిల్ శర్మ, మత్తగజం నాగరాజ శర్మ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భారత జవాన్లు పాకిస్తాన్‌తో ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారని, వారికి సోమేశ్వరుడు, నర్సింహస్వామి దీవెనలు అందించాలని పూజలు చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ముంజాల రాములు, బోనగిరి అశోక్, మేరుగు మధు, ముస్కు ఆశోక్, గూడూరు నిరంజన్, కమ్మగాని సతీశ్ పాల్గొన్నారు.

**సిద్ధేశ్వరాలయంలో..**

బచ్చన్నపేట : భారత సైనికుల పోరాటానికి మద్దతుగా కొడవటూరు సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ పాలకమండలి చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఈవో చిందం వంశీ నేతృత్వంలో ఆలయంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన పూజారి ఓంనమఃశివాయ, అర్చకులు సదాశివుడు, మహాశివుడు, సిబ్బంది లక్ష్మీకాంత్ రెడ్డి,భానుప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్, డైరెక్టర్ రాములు పాల్గొన్నారు.

## దేశ రక్షణలో సైనికుల సేవలు వెలకట్టలేనివి

- ఆపరేషన్ సింధూర్‌కు మద్దతు పలకాలి
- జవాన్ మురళీనాయక్ మృతి బాధాకరం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు




పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

పాలకుర్తి, మే 9 : దేశ రక్షణలో జవాన్ల సేవలు వెలకట్టలేనివని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శుక్రవారం భారత్-పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు నివాళులర్పించారు. యుద్ధంలో జవాన్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని తెలిపారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుడు మురళీనాయక్ అన్నారు. ఆపరేషన్ సింధూర్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు ప్రకటించాలని కోరారు. భారత సైన్యం వీరోచిత పోరాటానికి దేశ ప్రజలందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశ భద్రతపై రాజకీయాలు చేయవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న భారత సైనికులకు అభినందనలు తెలిపారు. భారత్‌కు ప్రపంచ దేశాలు మద్దతు పలకడం అభినందనీయమని ఆయన ఒక ప్రటకనలో పేర్కొన్నారు.

**కొవ్వొత్తులతో నివాళి**

పాకిస్తాన్‌తో వీరోచింతంగా పోరాడి వీరమరణం పొందిన తెలుగు బిడ్డ మురళీనాయక్‌కు పాలకుర్తి ప్రజలు నివాళులర్పించారు. రాజీవ్ చౌరస్తా నుంచి గుడివాడ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మురళీ నాయక్ జోహర్ అంటూ నినాదాలు చేశారు. భారత జవాన్‌లు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారన్నారు. వారికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, కమ్మగాని శ్రీకాంత్, మారం రవికుమార్, పబ్బా సంతోష్, గుమ్మడి రాజుల సాంబయ్య, బానోతు మహేందర్, లకావత్ వెంకట్, చారగొండ్ల ప్రసాద్, చీదర జగదీశ్, శీల చంద్రశేఖర్, నాగమల్ల సోమన్న, అరూరి రవి, బొనగిరి కృష్ణమూర్తి, లకావత్ నాగరాజు, పసులాది ప్రశాంత్, కమ్మగాని వెంకన్న, బానోత్ రాజు పాల్గొన్నారు.



వధూవరులకు కానుకలు అందజేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

## వధూవరులకు మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆశీర్వాదం

దేవరుప్పుల, మే 9 : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కారుపోతుల అంజయ్య కూతురు వివాహం శుక్రవారం తిరుమల గార్డెన్‌లో జరుగగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించి, కానుకలు అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, గ్రామ అధ్యక్షుడు లొడంగి వెంకటేశ్వర్లు, కారుపోతుల భిక్షపతి, జోగు సోమనర్సయ్య, తోటకూరి కిష్టయ్య, తీగల సత్తయ్య, లాలూనాయక్, యాదగిరి, గొడిశాల మల్లేశ్ ఉన్నారు.

## డీఈవోను కలిసిన భాషోపాధ్యాయులు

జనగామ చౌరస్తా, మే 9 : ఇటీవల జనగామ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)గా బాధ్యతలు స్వీకరించిన భోజన్నను శుక్రవారం కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం డైరీని ఆయనకు అందజేశారు. విద్యాశాఖ చేపట్టే ప్రతి భాషాభివృద్ధి, విద్యార్థుల అభ్యసనాభివృద్ధి కార్యక్రమాలకు సంఘం పూర్తి సహకారం ఉంటుందని జిల్లా అధ్యక్షుడు పానుగంటి రామమూర్తి డీఈవోకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పూట్ల శ్రీనివాసచారి, ఉపాధ్యక్షుడు గోపి కిషన్ పాల్గొన్నారు.



రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న యువకులు

## జనగామలో గాలి వాన బీభత్సం
### నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

జనగామ చౌరస్తా, మే 9 : జనగామ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. అంబేద్కర్‌నగర్ ఏరియాలో రోడ్డుపై చెట్టు కూలిపోవడంతో ఆ మార్గంలో వెళ్లే అంబులెన్స్, ఆర్టీసీ బస్సులతో పాటు పలు వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వెంటనే స్పందించిన పలువురు యువకులు దారికి అడ్డంగా పడి ఉన్న చెట్టును తొలగించారు. పలుచోట్ల కరెంట్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



కొడవటూరులో నర్సరీని పరిశీలిస్తున్న డీఏవో రామారావునాయక్

## ప్రతి ఊరిని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

బచ్చన్నపేట, మే 9 : ప్రతి ఊరును పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జనగామ జిల్లా వ్యవసాయశాఖాధికారి రామారావు నాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొడవటూరును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్మశానవాటిక, పల్లెప్రకృతి వనం, నర్సరీ, డంపింగ్‌యార్డును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డును పరిశుభ్రంగా తీర్చి దిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా వీధిదీపాల నిర్వహణ, నీటి సరఫరా సక్రమంగా చేపట్టాలన్నారు. డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అదే విధంగా ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య, ఎఫ్ఏ అశోక్ పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

## ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలి


జనగామ చౌరస్తా, మే 9 : పాకిస్తాన్ ఉగ్రవాదులను తుదముట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. దేశ పౌరులైన మావోయిస్టులను ఏరివేసేందుకు ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కామాక్షి వేడుకల మందిరంలో సీపీఐ 4వ పట్టణ మహాసభలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా తక్కళ్లపల్లి హాజరై మాట్లాడుతూ ఉగ్రవాదానికి కులం, మతం, దేశం లేదన్నారు. పాకిస్తాన్ పాలకులు, ఉగ్రవాదులు ఒకరిపై ఒకరు ఆధారపడి భారత్‌లో నరమేధాన్ని సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నదన్నారు. ఆ దేశానికి సరైన గుణపాఠం చెప్పాలన్నారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వానికి సీపీఐ బాసటగా నిలుస్తుందన్నారు. అలాగే, మావోయిస్టులు చర్చలకు వస్తామంటే ఒక కేంద్ర మంత్రి నియంతలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టులు తప్పు చేస్తే చట్ట ప్రకారం శిక్షించాలి తప్పా, ఎన్‌కౌంటర్ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, నాయకులు సొప్పరి సోమయ్య, మోతె శ్రీశైలం, చామకూర యాకుబ్, కేమిడి మల్లయ్య, గుగులోత్ సఖి, బాణాల వెంకటేశ్వర్లు, పుప్పాల అయిలయ్య, దయా నగేశ్ పాల్గొన్నారు.



తాటికొండలో రైతుల దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో

## భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

స్టేషన్ ఘన్‌పూర్, మే 9 : భూ సమస్యల నుంచి రైతులను విముక్తులను చేయడానికే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. భూభారతి చట్టం అమలు నేపథ్యంలో జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్ మండలం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కాగా, శుక్రవారం మండలంలోని తానేధార్‌పల్లి, తాటికొండ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తాటికొండలో 99 దరఖాస్తులు రాగా సాదాబైనామా 42, తానేధార్‌పల్లి గ్రామంలో 92 రాగా ఇందులో 42 సాదాబైనామా దరఖాస్తులు ఉన్నాయని ఆర్డీవో తెలిపారు. రైతులకు ఎలాంటి భూ సమస్యలను ఉన్నా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాని, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, డీటీ సంధ్యారాణి, ఆర్ఐలు సతీశ్, శ్రీకాంత్, సుమన్, సర్వేయర్ విజయకుమార్, సత్యనారాయణ, దేవేందర్ పాల్గొన్నారు.



రైల్వే ట్రాక్‌మెన్లకు క్యాప్‌లు అందజేస్తున్న రాజేందర్

## రైల్వే కార్మికుల సంక్షేమమే లక్ష్యం

స్టేషన్ ఘన్‌పూర్, మే 9 : రైల్వే కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా మజ్దూర్ యూనియన్ పని చేస్తున్నదని ట్రాక్‌మెన్ కాజీపేట్ ఇంజినీర్ బ్రాంచ్ సెక్రటరీ ఇల్లందుల రాజేందర్ అన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని శుక్రవారం డివిజన్ కేంద్రంలోని 50 మంది ట్రాక్‌మెన్లకు క్యాప్‌లను అందించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ ట్రాక్‌మెన్ కార్మికుల కోసం హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం 8వ పే కమిషన్ అందించాలని డిమాండ్ చేశారు. ట్రాక్‌మెన్ కార్మికుల కోసం టూల్ రూమ్‌లు, రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో ట్రాక్ సేఫ్టీ కోసం రాత్రి గస్తీ తిరిగే కార్మికులను ఇద్దరి చొప్పున కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కనకరాజు, చిలక శ్రీనివాస్, ఆవుల కుమార్, జీ కుమార్, తాటి కుమార్, వినోద్, సంపత్, లక్ష్మయ్య, కిరణ్, సన్ని పాల్గొన్నారు.